నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

ఉప్పల్: 33/11 కేవీ ఉప్పల్ సబ్‌స్టేషన్ పరిధిలోని ఘట్‌కేసర్ ఫీడర్ పరిధిలో బుధవారం ఉదయం 10.30 నుంచి 1.30 వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఏఈ నిఖిల్ తెలిపారు. చిలుకానగర్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 వరకు విద్యుత్ సరఫరాను నిలిపేస్తున్నట్లు ఏఈ పేర్కొన్నారు.

మల్కాజిగిరి: గౌతంనగర్ సబ్‌స్టేషన్ 11కేవీ ఐఎన్‌నగర్ ఫీడర్ పరిధిలో మరమ్మతుల కారణంగా బుధవారం ఉదయం 10 గంటల నుంచి ఒంటి గంట వరకు, 11 కేవీ ఉత్తమ్‌నగర్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ కళ్యాణ్ తెలిపారు.

వైభవంగా రేణుక ఎల్లమ్మ కల్యాణం


కల్యాణోత్సవంలో మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్‌లో జమదగ్ని మహాముని రేణుక ఎల్లమ్మ కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలని కోరారు. మాజీ మేయర్ అమర్‌సింగ్, మాజీ డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్‌గౌడ్, పార్టీ సీనియర్ నాయకులు చంద్రారెడ్డి, శ్రీకాంత్, మహేష్, బండి శ్రీనివాస్, ఆలయ కమిటీ సభ్యులు విష్ణువర్ధన్‌గౌడ్, కాలనీవాసులు, భక్తులు తదితరులు అమ్మవారి కల్యాణోత్సవంలో పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాలు ఆక్రమిస్తే కఠిన చర్యలు

బోడుప్పల్: ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని బోడుప్పల్ కమిషనర్ శైలజ అన్నారు. రా చెరువు కింద నాలాను ఆక్రమించి చేపడుతున్న నిర్మాణం ఫిల్లర్లను మంగళవారం జేసీబీతో కూల్చివేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి, ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపట్టిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. మున్సిపల్, ఇరిగేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

చైన్ స్నాచింగ్..

మేడిపల్లి: దేవాలయానికి నడుచుకుంటూ వెళ్తున్న ఓ మహిళ మెడలో నుంచి ఇద్దరు దుండగులు ద్విచక్ర వాహనంపై వచ్చి మెడలోని పుస్తెలతాడును ఎత్తుకెళ్లిన ఘటన మేడిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పీర్జాదిగూడ గాయత్రీనగర్ కాలనీలో నివాసం ఉంటున్న చందన (22)మంగళవారం మధ్యాహ్నం స్థానికంగా ఉన్న సాయిబాబా గుడికి నడుచుకుంటూ.. వెళ్తుండగా.. ఆలయ సమీప ప్రాంతానికి రాగానే ఇద్దరు యువకులు బైక్‌పై వెనకాల నుంచి వచ్చి ఆమె మెడలోని 2 తులాల పుస్తెలతాడుని తెంపుకుని పరారయ్యారు. దీంతో బాధితురాలు మేడిపల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కమ్మేసిన గుర్రపు డెక్క!

- పీర్జాదిగూడ మున్సిపల్‌లో అధ్వానంగా చెరువులు
- చెరువుల్లో కలుస్తున్న డ్రైనేజీ నీరు, దుర్వాసనతో కాలనీలు
- పట్టించుకోని అధికారులు.. రోగాల బారిన ప్రజలు

ఒకప్పుడు వర్షపు నీటితో నిండుకుందలా.. ఊరికి కావాల్సినంత మత్స్య సంపదతో చెరువులు కళకళలాడేవి. ప్రస్తుతం గుర్రపుడెక్క కమ్మేయడంతో చెరువుల్లో స్వచ్ఛమైన నీరు కనిపించకుండా పోతుంది. మురుగు నీటితో దుర్వాసన వెదజల్లుతోంది.


మురుగు నేరుగా పోచమ్మ కుంటలో కలుస్తున్న దృశ్యం

మేడిపల్లి: పోచమ్మకుంట, పెద్దచెరువు, ఊరకుంట, పుల్చేర్ కుంటలోనికి నేరుగా డ్రైనేజీ పైపులైన్ వదలడంతో అయా ప్రాంతాల్లో చెరువులన్నీ డ్రైనేజీ నీటితో నిండిపోయాయి. జనాభాతో పాటు నివాససముదాయాలు పెరగడంతో డ్రైనేజీ నీరంతా చెరువుల్లోకి చేరుతుంది. ప్రత్యేక పైపులైన్లు వేసి డ్రైనేజీ నీరు చెరువుల్లో కలవకుండా చూడాల్సిన అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలున్నాయి.

దోమలతో బెంబేలెత్తుతున్న ప్రజలు

పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో చెరువుల్లో ఏపుగా గుర్రపుడెక్క పెరగడంతో దోమలు విజృంభిస్తున్నాయి. దీంతో కాలనీలు, అపార్ట్‌మెంట్లు, బస్తీల్లోని ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దోమల బెడదతో ప్రజలు బెంబేలెత్తి పోతున్నారు. సాయంత్రమైతే ఇళ్లల్లో దోమలు చేరి కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయని ప్రజలు వాపోతున్నారు. ఈ విషయంలో మున్సిపల్ సిబ్బంది ఫాగింగ్ చేయకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

వర్షాకాలంలో ప్రజలు రోగాల బారినపడే అవకాశం

మురుగు నీటిలో దోమల కారణంగా డెంగీ, మలేరియా జ్వరాలకు ప్రజలు గురయ్యే అవకాశం పొంచి ఉంది. క్రిములను మోసుకొచ్చే ఎనాఫిలిస్, క్యూలెక్స్, ఈడీస్, మన్‌సోనియా దోమలు ప్రజారోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు చెరువులు, కుంటలు, మురుగు కాల్వలపై దృష్టిసారించి గుర్రపు డెక్కను తొలగించి, దోమలను నివారించాలని ప్రజలు కోరుతున్నారు.

అధికారులు స్పందించాలి



చెరువుల్లో పేరుకుపోయిన గుర్రపు డెక్కతో దోమలు విజృంభించి పాత పీర్జాదిగూడ గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి దోమల నివారణపై ప్రత్యేక చర్యలు తీసుకుని, మురుగు చెరువుల్లో కలవకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలి. – కుర్ర శివకుమార్‌గౌడ్, మాజీ డిప్యూటీ మేయర్

నాలాపై స్లాబ్ నిర్మాణాన్ని విరమించుకోవాలి


డీసీని కలిసిన బాలసరస్వతీనగర్ కాలనీవాసులు

మల్కాజిగిరి: సర్దార్ పటేల్‌నగర్‌లోని వరద నీటి నాలాపై స్లాబ్ నిర్మాణం విరమించుకోవాలని కాలనీవాసులు మాజీ కార్పొరేటర్ జగదీష్‌గౌడ్‌తో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో కాలనీలో ప్రజలు ముంపునకు గురికాకుండా తగిన చర్యలు తీసుకున్నామన్నారు. వరదనీటి నాలాపై కప్పు లేకుండా ఉంటేనే నీరు సాఫీగా వెళ్లేందుకు ఆస్కారం ఉంటుందని, లేదంటే వరద తాకిడితో ముంపునకు గురయ్యే ప్రమాదం ఉందన్నారు. తక్షణమే పనులు నిలిపివేయాలని డిప్యూటీ కమిషనర్‌ను కోరామన్నారు. ఇంజినీరింగ్ విభాగం ఈఈ, డీఈతో చర్చించి తుది నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారన్నారు. కమల్, శ్రీకాంత్, జాకబ్, శ్రీధర్‌రెడ్డి, పుష్పమ్మ, అనిత, లలిత తదితరులు పాల్గొన్నారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం


పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బండారి, కార్పొరేటర్ ప్రభుదాస్

కుషాయిగూడ: డివిజన్ అభివృద్ధికి తోడ్పాటును అందిస్తానని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. మీర్‌పేట్–హెచ్‌బీకాలనీ డివిజన్ పరిధిలోని ఇంద్రనగర్, మంగాపురం, తిరుమలనగర్, వేంకటేశ్వరనగర్ కాలనీల్లో రూ.1.15 కోట్లతో నిర్మించ తలపెట్టిన సీసీరోడ్డు పనులను మంగళవారం కార్పొరేటర్ ప్రభుదాస్‌తో కలిసి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రతిరోజూ నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషిచేస్తున్నట్లు తెలిపారు. డివిజన్ అభివృద్ధికి సహకరిస్తున్న ఎమ్మెల్యేకు కార్పొరేటర్ కృతజ్ఞతలు తెలిపారు. మాజీ కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి, డీఈ రూప, ఏఈ లింగారావు, ప్రవీణ్, జంపాల్‌రెడ్డి, నవీన్‌గౌడ్, సుదర్శన్, రమేష్, వెంకన్న, దాసు తదితరులు పాల్గొన్నారు.

సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం

అల్వాల్: అల్వాల్‌హిల్స్ గోదాదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. మన సంస్కృతిని కాపాడటం, దేశ రక్షణ, హిందువుల ఐక్యత, ధర్మ రక్షణకు ప్రతి మంగళవారం, శనివారం సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహిస్తున్నామన్నారు.

ప్రత్యేక పూజలు

బోడుప్పల్: సాయి భవానీనగర్ కాలనీలోని స్ఫటికలింగేశ్వరస్వామి, సహిత సీతారామాంజనేయస్వామి దేవాలయంలో మంగళవారం ఆలయ చైర్మన్ మంజులరమేష్‌యాదవ్ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సీతారామచంద్రస్వామి వారికి పంచామృత అభిషేకం, ఆలయంలో వివిధ దేవతలకు పూజలు చేశారు. ఆలయ పూజారి రాహుల్‌శర్మ పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించాలి

గౌతంనగర్: కాలనీలో మౌలిక వసతులు కల్పించాలని కోరుతూ అసోసియేషన్ ప్రతినిధులు కార్పొరేటర్ మేకల సునీత కార్యాలయంలో బీఆర్ఎస్ నేతలు వినతిపత్రం అందజేశారు. కాలనీలో తాగునీటి సమస్య ఉందని, పవర్ బోరు మంజూరు చేయాలని, స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. కాలనీ ప్రతినిధులు బ్రహ్మయ్య, రాము, కిట్టు, నర్సింగ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

'ఎప్‌సెట్' కౌన్సెలింగ్.. సర్టిఫికెట్ల పరిశీలన

రామంతాపూర్ : రాష్ట్రంలో ఇటీవల ఇంజినీరింగ్ ఫార్మసీ అగ్రికల్చరల్ ప్రవేశాల కోసం నిర్వహించిన 'ఎప్‌సెట్' ప్రవేశ పరీక్షలో ఉత్తీర్ణులైన అభ్యర్థులకు కౌన్సెలింగ్‌లో భాగంగా మంగళవారం రామంతాపూర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో 710 మంది అభ్యర్థుల సర్టిఫికెట్లు పరిశీలించారు. ఈ సందర్భంగా కౌన్సెలింగ్ హెల్ప్ డెస్క్ కో– ఆర్డినేటర్ ప్రిన్సిపాల్ వినయ్ కుమార్ మాట్లాడుతూ.. సర్టిఫికెట్ల పరిశీలన 8 వరకు కొనసాగుతుందని వివరించారు.

పగలే వెలుగులు !


ఉత్తమ్‌నగర్‌లో వెలుగుతున్న వీధి లైటు

గౌతంనగర్: డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో పట్టపగలే వీధి దీపాలు వెలుగుతున్నాయి. రామాంజనేయనగర్, అన్నపూర్ణ సొసైటీ, న్యూ, ఓల్డ్ మిర్జాలగూడ, జ్యోతినగర్, తదితర ప్రాంతాల్లో ప్రధాన, అంతర్గత రోడ్లలో వీధిదీపాలు పట్టపగలే వెలుగుతున్నాయి. విద్యుత్ అధికారులు స్పందించి వీధి దీపాలకు ఆన్, ఆఫ్ వ్యవస్థను ఏర్పాటుచేయాలని కోరుతున్నారు.

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు


మాట్లాడుతున్న సీఐటీయూ పాలడుగు భాస్కర్

అల్వాల్: దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా కార్యదర్శి శోభారాణి అన్నారు. మంగళవారం వినాయక్‌నగర్‌లో మల్కాజిగిరి సెక్టార్ అంగన్‌వాడీ యూనియన్ సమావేశం నిర్వహించి దేశవ్యాప్త సమ్మె వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శోభారాణి మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను వేగవంతంగా అమలు చేస్తుందని ఆరోపించారు. దీనిలో భాగంగా 29 కార్మిక చట్టాలను రద్దుచేసి, 4 లేబర్ కోడ్స్‌ను తీసుకొచ్చిందన్నారు. ఐసీడీఎస్‌లో పని చేస్తున్న అంగన్‌వాడీ ఉద్యోగులందరూ ఈ సమ్మెలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సీఐటీయూ జిల్లా కోశాధికారి ఉన్ని కృష్ణ, అంగన్‌వాడీ యూనియన్ నాయకురాలు భాగ్యరేఖ, శ్రీదేవి, రాణి, టీచర్లు తదితరులున్నారు.

కుషాయిగూడ: ఈనెల 9న నిర్వహించ తలపెట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ పిలుపునిచ్చారు. మంగళవారం చర్లపల్లి ఇండస్ట్రియల్ ఎంప్లాయిస్ యూనియన్, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సురాన చౌరస్తాలో నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్రం తీసుకొచ్చిన 4 లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, శ్రీనివాసులు, శంకర్‌రావు, ప్రవీణ్, శ్రీనివాస్, మణికంఠ, బాలరాజు, రవీందర్ పాల్గొన్నారు.

ఉప్పల్: దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ.. కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సీఐటీయూ, ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ, బీఆర్‌టీయూ సంఘాల ప్రతినిధులతో కలిసి పోస్టర్‌ను ఆవిష్కరించారు. వెంకన్న, జంగయ్య, లాలు కృష్ణ, గంగారాం, ఉర్మిళ, అంజనేయులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం


వైద్య శిబిరంలో ఎమ్మెల్యే బండారి, కార్పొరేటర్ దేవేందర్‌రెడ్డి

మల్లాపూర్: ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. మంగళవారం మల్లాపూర్ కౌండిన్య భవన్‌లో అవని వారధి చారిటబుల్ ట్రస్ట్, లయన్స్ క్లబ్ సంయుక్తాధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. దీనికి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం వైద్యులు అవసరమైన వారికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి, ట్రస్ట్ చైర్మన్ నర్సింగ్‌గౌడ్, యశోద ఆసుపత్రి వైద్యులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

దోమల నియంత్రణపై స్కూళ్లల్లో అవగాహన



అల్వాల్: జీహెచ్ఎంసీ కమిషనర్ ఆదేశానుసారం అల్వాల్‌లోని ప్రభుత్వ బాలుర పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు వర్షాకాలంలో దోమల ద్వారా వచ్చే వ్యాధులు, దోమల బెడదను నియంత్రించాలని అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రతి మంగళవారం, శుక్రవారం పాఠశాలలో శనివారం కళాశాలల్లో అవగాహన సదస్సులను నిర్వహిస్తామన్నారు. అనంతరం అల్వాల్ సర్కిల్ పరిధిలోని కొత్త చెరువు, చిన్నరాయుని చెరువు, మోదుకులకుంట చెరువుల్లో దోమల లార్వాలను నియంత్రించేందుకు ఆయిల్‌బాల్స్ వేశారు. అసిస్టెంట్ ఎంటమాలజిస్ట్ అనిల్‌కుమార్, సూపర్‌వైజర్లు గణేష్, రాజు, సిబ్బంది పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరణ

కాప్రా: విద్యార్థుల సమస్య పరిష్కారానికి పీడీఎస్‌యూ పోరుబాట చేపట్టింది. విద్యార్థుల స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ పెండింగ్ బకాయిలు తక్షణమే విడుదల చేయాలని, 72 గంటల కళాశాలల బంద్ చేపట్టింది. ఈ సందర్భంగా మంగళవారం కమలానగర్‌లో పోస్టర్‌ను ఆవిష్కరించారు. గ్రేటర్ సహాయ కార్యదర్శి తీగల శ్యామ్ మాట్లాడుతూ.. నేడు 3, 4వ తేదీన డిగ్రీ, పీజీ, ఇంజినీరింగ్ కళాశాలల బంద్‌ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. పెండింగ్‌లో ఉన్న రూ. 7200 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. బకాయిలను విడుదల చేయకుంటే ఉద్యమం మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. పీడీఎస్‌యూ నేతలు హరీష్, శ్రీవల్లి, అనూష, మహేందర్, స్రవంతి, నవీన్, శివ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ


నోట్‌బుక్స్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బండారి, రాగిడి లక్ష్మారెడ్డి

ఉప్పల్: ఆసక్తి కలిగిన నిరుపేద ప్రభుత్వ విద్యార్థులకు అండగా ఉంటామని, ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. చిలుకానగర్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు మధురా చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ రాగిడి లక్ష్మారెడ్డితో కలిసి నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ.. ట్రస్ట్ ద్వారా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులను ప్రోత్సహిస్తూ.. ఎంతో మందిని విద్యావంతులుగా తీర్చిదిద్దామన్నారు. పదోతరగతి ఫలితాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను అందజేసినట్లు తెలిపారు. ట్రస్ట్ ద్వారా అనేక కార్యక్రమాలు చేపట్టినట్లు పేర్కొన్నారు. బన్నాల ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేటర్ పర్యటన

అల్వాల్: మచ్చబొల్లారం డివిజన్ శక్తి గణేష్‌నగర్‌లో మంగళవారం కార్పొరేటర్ రాజ్‌జితేంద్రనాథ్ అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీలో పారిశుద్ధ్య నిర్వహణ, అంతర్గత రోడ్లను వేయాలని అధికారులతో చర్చించారు. అనంతరం సింహ వారాహి అమ్మవారిని దర్శించుకుని కుంకుమార్చనలు చేశారు. ఏఈ రవళి, ప్రభాకర్, ఎలక్ట్రికల్ ఏఈ స్రవంతి, జలమండలి అధికారి రమేష్, నాయకులు బొబ్బిలి సురేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, శ్రీశైలంయాదవ్, నవీన్, కొండయ్య, వెంకటేష్, కాలనీవాసులు సంతోష్‌రెడ్డి, శ్రీధర్‌రావు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.


శక్తి గణేష్‌నగర్‌లో పర్యటిస్తున్న కార్పొరేటర్ రాజ్‌జితేంద్రనాథ్



వైద్యులను సత్కరిస్తున్న లయన్ డా. భారతి


జిల్లా కేంద్రం ఆసుపత్రిలో జరిగిన వేడుకల్లో ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

వైద్యులు దైవంతో సమానం!

ఉప్పల్, మల్కాజిగిరి జోన్ పరిధిలో వైద్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మంగళవారం జరిగిన కార్యక్రమంలో వైద్యులను సత్కరించారు. ఆసుపత్రుల్లో వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. పలువురు మాట్లాడుతూ.. వైద్య వృత్తిని అంకిత భావంతో చేసినప్పుడే గుర్తింపు వస్తుందని కొందరు అభిప్రాయపడగా.. వైద్యులు దైవంతో సమానమని, తల్లిదండ్రులు జన్మనిస్తే వైద్యులు మనకు పునర్జన్మనిస్తారని మరికొందరు కొనియాడారు. – ఉప్పల్, మల్కాజిగిరి జోన్ బృందం.


సెయింట్ జాన్స్ హైస్కూల్‌లో డాక్టర్స్‌డే వేడుకలు


వైద్యులను సత్కరిస్తున్న వాసవీక్లబ్ ప్రతినిధులు


కాప్రా గాంధీనగర్ పల్లె దవాఖానాలో ఉచిత వైద్య శిబిరం

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220376
9912225470
9912220571